# నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 25 జూలై 2024 | RANGAREDDY


## దారి ఇట్ల.. నడిచేదెట్లా..?



చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల గ్రామంలో కురుస్తున్న వర్షానికి రోడ్డు బురదమయంగా మారింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై నడిచివెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# 46,000 మందికే..మాఫీ

## వికారాబాద్ జిల్లాలో అర్హులైన రైతులు లక్షపైనే..

- రేషన్‌కార్డు మెలికతోనే అన్యాయం
- పాస్‌బుక్‌ను ప్రామాణికంగా తీసుకుంటే చాలామందికి లబ్ధి చేకూరేది
- రుణమాఫీ కాలేదంటూ ఆఫీసులు, బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు



వికారాబాద్, జూలై 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నది. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఎన్నికల ముందు హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా రుణాలను మాఫీ చేస్తూ దగా చేస్తున్నది. అంతేకాకుండా రూ.లక్ష లోపు మాఫీ అవుతున్న రుణాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుని అర్హులైన వేలాది మంది అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నది. పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ఆ విధానం అమలు కాకపోవడం గమనార్హం. కాగా జిల్లాలో రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ ప్రక్రియ చేపట్టడంతో కేవలం 46 వేల మంది రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. అదే పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకున్నట్లయితే సుమారు లక్షకుపైగా రైతులకు మేలు జరిగేది. అయితే ఒక కుటుంబంలో నలుగురి పేరిట భూములుండి వేర్వేరుగా పట్టాదారు పాసుపుస్తకాలుంటే రేషన్‌కార్డు ఆధారంగా వీరందరినీ ఒకే యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నారు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉంటే పై మొత్తాన్ని వచ్చేనెల 15 లోపు చెల్లిస్తేనే మాఫీ వస్తుందని..లేకపోతే వర్తించదని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూసిన అన్నదాతలకు... రేవంత్‌రెడ్డి సర్కారు కొత్త నిబంధనల పేరుతో అప్పుల పాలు చేస్తున్నదని మండిపడుతున్నారు. గతంలో ఉన్న కేసీఆర్ సర్కారే రైతులను అన్ని విధాలా ఆదుకున్నదని గుర్తు చేసుకుంటున్నారు.

### అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు



నేను, నా భార్య కలిసి హస్నాబాద్‌లోని ఎస్‌బీహెచ్‌లో రూ.65,500, రూ.25,000 చొప్పున రుణం తీసుకున్నాం. 23-07-2020లో ఆ రుణాలను రెన్యూవల్ కూడా చేశాం. మా ఇద్దరి పేరున దాదాపుగా రూ.లక్షలోపే అప్పు ఉంటుంది. అయినా మా రుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో మా పేర్లు రాలేదు. వ్యవసాయాధికారులను సంప్రదిస్తే బ్యాంకు అధికారులను అడుగుమంటున్నారు. వారిని సంప్రదిస్తే మాకు తెలియదు.. ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారమే రుణ మాఫీ జరుగుతున్నదని చెబుతున్నారు. మాకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు.

-ఎరుకలి పెద్ద ఆశన్న, రైతు, హస్నాబాద్, కొడంగల్

### అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



నేను, 2019లో మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో రూ. 50,000 రుణం తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. నేను అర్హుడిని అయినా నాకు మాఫీ వర్తించలేదు. ప్రభుత్వం స్పందించి అందరికీ రుణమాఫీ చేయాలి.

– ఖదీర్, అంగడి చిట్టంపల్లి గ్రామం, పూడూరు

### కార్యాలయాలు కిటకిట

రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ కాలేదంటూ వేలాది మంది అన్నదాతలు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం మొదలుకొని క్షేత్రస్థాయిలో ఏఈవోల వరకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. కాం గ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పెట్టి కొంతమందికే రుణమాఫీ చేస్తున్నదని మండిపడు తున్నారు. మా రుణాలను కూడా మాఫీ చేయాలని వేల సంఖ్యలో ఫిర్యాదు చేస్తున్నారు. రుణమాఫీ కాని రైతుల సంఖ్య అధిక మొత్తంలో ఉండడంతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలోని టెక్నికల్ సెక్షన్, మండల వ్యవసాయాధికారి కార్యాలయా ల్లో, క్షేత్రస్థాయిలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు రుణమాఫీ కాని రైతుల విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు.

### సర్కారు రైతులకు అన్యాయం చేస్తున్నది



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తున్నది. అర్హులైన వారికి కూడా రూ. లక్షలోపు రుణాన్ని మాఫీ చేయడం లేదు. నేను గతేడాది బ్యాంకులో రూ.49 వేలు తీసుకున్నా. నా రుణం కూడా మాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల ముందు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. అధికారంలోకి రాగానే అనేక కొర్రీలు, నిబంధనలు పెట్టి అన్నదాతలను ఆగం చేస్తున్నది. – సీత లింగయ్య, ఆర్కపల్లి, మాడ్గుల

### ప్రభుత్వం గొప్పలు చెప్పడం ఆపాలి..

అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక షరతులు, మెలికలు పెడుతూ అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నది. నేను నందిగామ పీఏసీఎస్‌లో రూ.40 వేల వరకు క్రాప్ లోన్ తీసుకున్నా. రూ. లక్ష లోపు ఉన్నా ఆ రుణం మాఫీ కాలేదు. ప్రభుత్వం గొప్పలు చెప్పడం ఆపి రైతుల రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలి.

–రాంబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ నందిగామ



### ఏడాదికోసారి రెన్యూవల్ చేశా..

నేను మండల కేంద్రంలోని కెనరా బ్యాంకులో రూ. 54,000 క్రాప్ లోన్ తీసుకున్నా. ఏడాదికోసారి ఆ రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తున్నదని తెలిసి చాలా సంతోషించా. బ్యాంకుకు వెళ్లి అడిగితే మీ రుణం మాఫీ కాలేదని అధికారులు చెప్పారు. నేను అర్హుడిని అయినా ప్రభుత్వం నా అప్పును ఎందుకు మాఫీ చేయలేదో అర్థం కావడం లేదు. – గోరేటి అంజయ్య యాదవ్, కడ్తాల్



### నేనూ అర్హురాలినే..అయినా మాఫీ కాలె..

నేను హస్నాబాద్‌లోని ఎస్‌బీహెచ్ నుంచి రూ.77000 అప్పు తీసుకున్నా. ప్రస్తుతం ప్రకటించిన రూ.లక్ష లోపు రుణ మాఫీలో నా పేరు రాలేదు. బ్యాంకు అధికారులకు అడిగితే మాకు తెలియదు ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారమే రుణమాఫీ జరిగిందని చేతులు దులుపుకొంటున్నారు. వ్యవసాయాధికారులను అడిగితే మాకు తెలియదు బ్యాంకు అధికారులకే తెలుసని చెబుతున్నారు. మరి ఎవరినీ అడగాలి.. రుణమాఫీ ఏవిధంగా జరుగుతున్నది. రూ.లక్షలోపు రుణమాఫీకి నేను అర్హురాలినే. కానీ, నా అప్పు మాఫీ కాలేదు. - మోసిన్‌బేగం, రైతు, హస్నాబాద్, కొడంగల్



# వీడని చిక్కుముళ్లు

## రుణమాఫీలో సమస్యలు యథాతథం

- పోర్టల్ చూసి కారణాలు చెప్పడం మినహా..సమస్యలకు పరిష్కారం చూపని అధికారులు
- వారం రోజులు అవుతున్నా.. పూర్తిస్థాయిలో జమకాని రూ.లక్ష రుణమాఫీ డబ్బులు
- జాబితాల్లో పేర్లున్నా.. నేటికీ తప్పని ఎదురు చూపులు



రంగారెడ్డి, జూలై 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రుణమాఫీ సంబురం ఒక్క రోజుకే పరిమితమైనది. రూ.లక్ష రుణమాఫీకి సంబంధించి ఒక్క రోజే రైతుల బ్యాంకు ఖాతాల్లో మాఫీ డబ్బులను జమచేయగా..ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో మాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావడంలేదు. దీంతో రైతాంగం గత వారం రోజులుగా వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రయోజనం లేదు. రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసింది. రైతులు ఆధార్ కార్డు ఇస్తే..పోర్టల్‌లో చెక్ చేస్తున్న అధికారులు రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను చెబుతున్నారు. తప్పితే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

### రెండురోజులకే పరిమితమైన మాఫీ మురిపెం..

రంగారెడ్డి జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06 కోట్ల రుణమాఫీని చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆయా జాబితాలను బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులకు పంపించారు. రూ.లక్ష రుణమాఫీ ప్రక్రియను ఈ నెల 18న లాంఛనంగా ప్రారంభించారు. మొదటి, రెండు రోజుల్లో మాత్రమే కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమఅయ్యాయి. ఆ తర్వాత మాఫీ ప్రక్రియ నిలిచిపోయింది. రుణమాఫీ జాబితాల్లో పేర్లు వచ్చిన రైతులకు సైతం కొంత మందికి వారివారి ఖాతాల్లో మాఫీ డబ్బులు పడలేదు. జాబితాల్లో పేర్లు చూసుకుని ప్రతిరోజూ బ్యాంకులకు వెళ్తున్న రైతులకు నిరాశే ఎదురవుతున్నది. రెండు రోజులే మురిపించి ఆ తర్వాత రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాకపోవడంపై బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు 48,239 మంది రైతులకు రూ.250 కోట్ల మేర వారి ఖాతాల్లో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా..1500 మంది రైతులకు పైగా ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ కావాల్సి ఉన్నది.

### జిల్లాలో ఇదీ 'మాఫీ' పరిస్థితి..

- జిల్లాలో రూ. లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు లక్షకు పైగా ఉంటారని అంచనా. అయితే ప్రస్తుతం 49,741 మందికి మాత్రమే తొలి విడతలో అవకాశం దక్కింది. మిగిలిన వారికి తదుపరి విడతల్లో మాఫీ వస్తుందని చెబుతున్నా రైతులకు నమ్మకం కుదరడం లేదు.
- తేదీ.12.12.2018 –తేదీ. 9.12. 2023 మధ్య తీసుకున్న కొత్తరుణాలు, రెన్యూవల్ చేసుకున్న స్వల్పకాలిక పంట రుణాలకు మాత్రమే మాఫీని వర్తింపజేశారు. దీర్ఘకాలిక టర్మ్ రుణాలు, సాగుఅనుబంధ, రీషెడ్యూల్ రుణాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో చాలా మందికి మొండిచెయ్యి చూపించినట్లైంది.
- ఆధార్, రేషన్‌కార్డులతో సరిపోల్చి రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు రూ.లక్షలోపు రుణముంటేనే తొలి జాబితాలో ప్రకటించారు. రూ. లక్ష దాటితే రెండో జాబితాలో, రూ.1.50 లక్షలు దాటితే మూడో దఫాలో రైతుల పేర్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.
- రేషన్ కార్డు లేని వారిలో చాలామంది కుటుంబ సభ్యుల పేర్లు నిర్ధారణ జరగాల్సి ఉన్నందున వీరి పేర్లు కూడా జాబితాల్లో రాలేదు. మరోపక్క రెండు, మూడుచోట్ల రుణాలు తీసుకున్న వారి వివరాలు ఆధార్ అనుసంధానంతో వెల్లడి కావడంతో ఆయా రైతుల పేర్లు కూడా తొలి విడత జాబితాల్లో రాలేదు.
- కొన్ని బ్యాంకుల పంట రుణ ఖాతాలు ఆన్‌లైన్ సర్వర్‌తో అనుసంధానం లేకపోవడంతో వారి జాబితా ప్రభుత్వం వద్ద అందుబాటులో లేక బ్యాంకుల వారీగా వివరాలను తెప్పించుకుని రెండు, మూడు విడతల్లో నిధుల బదిలీని ప్రభుత్వం చేపడుతుందని అధికారులు చెబుతున్నా.. దీనిపై స్పష్టత కొరవడింది.
- ఆదాయపన్ను చెల్లిస్తున్న వారిని ప్రస్తుతం పరిగణనలోకి తీసుకోలేదు. మూడేండ్లపాటు వడ్డీ చెల్లించకపోతే మొండి బకాయిలుగా భావించిన బ్యాంకులు ఆయా ఖాతాలను ఎన్‌పీఏ జాబితాల్లో చేర్చాయి. ఆ ఖాతాలకు సైతం రుణమాఫీ నిధులు రాలేదు. అసలు, వడ్డీ కలిపి రూ.లక్ష దాటినా.. ఆయా రైతుల పేర్లు రుణమాఫీ జాబితాల్లో చోటుచేసుకోలేదు.

### రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు..



నేను, వ్యవసాయ పనుల నిమిత్తం కొత్తపేట పీఏసీఎస్ బ్యాంకులో రూ. 70,000 అప్పు తీసుకున్నా. ప్రస్తుతం ప్రకటించిన రూ. లక్ష రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. మొబైల్‌కు మెసెజ్ కూడా రాలేదు. ఎవరిని అడగాలో తెలియడంలేదు. గతంలో రుణమాఫీ అయినప్పుడు డైరెక్టుగా బ్యాంకు ఖాతాలో జమఅయ్యాయి. అధికారులు నా సమస్యకు పరిష్కారం చూపాలి. - శానమోని లక్ష్మమ్మ, మహిళా రైతు, చౌలపల్లి, కేశంపేట

# పైలట్ ప్రాజెక్టుగా బొంరాస్‌పేట

- ఆర్‌బీఎస్‌కేకు మండలం ఎంపిక
- 0-6 ఏండ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాల గుర్తింపునకు ఇంటింటి సర్వే
- అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లకు శిక్షణ ఇచ్చిన వైద్యారోగ్యశాఖ
- వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వే



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు

బొంరాస్‌పేట, జూలై 24 : మన దేశంలో ఏటా పుట్టిన ప్రతి వంద మంది శిశువుల్లో ఆరు నుంచి ఏడుగురు వివిధ రకాల లోపాలతో జన్మిస్తున్నారు. ఇది పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిని దెబ్బతీస్తుంది. ఇటువంటి సమస్యలను సకాలంలో గుర్తించకపోతే చిన్నారుల్లో వినికిడి, దృష్టి లోపంతోపాటు శాశ్వత వైకల్యానికి దారితీస్తుంది. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించేందుకు.. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) పేరుతో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో ఉన్న లోపాలను గుర్తించి చికిత్స కోసం దవాఖానలకు రెఫర్ చేస్తుంటారు. సాధారణంగా ఆర్‌బీఎస్‌కే మొబైల్ బృందాలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రమే సందర్శించి వాటిలో ఉన్న విద్యార్థులను మాత్రమే పరీక్షిస్తుంటారు. మిగతా వారు ఇలాంటి వైద్య పరీక్షలకు దూరంగా ఉంటారు. ఫలితంగా వారిలో పుట్టుకతో వచ్చే లోపాలున్నా తల్లిదండ్రులు గుర్తించక వాటిని నిర్లక్ష్యం చేస్తుంటారు. దానిని నివారించేందుకు వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేట మండలాన్ని ఆర్‌బీఎస్‌కే పైలట్ ప్రాజెక్టుగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎంపిక చేశారు. ఆరేండ్లలోపే ఇలాంటి లోపాలను గుర్తించి వారికి చికిత్స అందిస్తే మామూలు స్థితికి తీసుకురావచ్చన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టింది.

### మండలంలోని 0-6 ఏండ్లలోపు పిల్లలకు..

పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన బొంరాస్‌పేట మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఇంటింటికెళ్లి సర్వే నిర్వహిస్తారు. అంగన్‌వాడీలు, పాఠశాలలకెళ్లే వారితోపాటు వలస వెళ్లిన వారి పిల్లలు, ఇండ్ల వద్ద ఉండే చిన్నారులు, సంచార జాతుల పిల్లల తల్లిదండ్రులను కలిసి పిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాలను అడిగి తెలుసుకుంటారు. ఇందుకోసం సర్వే చేసే వారికి 25 ప్రశ్నలతో కూడిన పేపర్లను అందిస్తారు. ఈ ప్రశ్నల్లో పిల్లలు పుట్టగానే ఏడ్చారా..? వినికిడి శక్తి ఉందా..? కంటి చూపు బాగా ఉందా ..? లేదా అని పరిశీలిస్తారు. అదేవిధంగా పిల్లలు మూడు నుంచి నాలుగు నెలలు వచ్చే సరికి కొన్ని శబ్దాలు చేయాలి. అలా చేయకుంటే ఏదో లోపం ఉన్నట్లు గుర్తిస్తారు. కాళ్లు వంకర పోవడం, తల సైజు వంటి వాటిని పరిశీలిస్తారు. పిల్లల అభివృద్ధికి సంబంధించి 3-5 నెలల చిన్నారులు మెడ నియంత్రణ, తిప్పడం, 5-6 నెలల్లో పాకడం, 6-8 నెలల్లో కూర్చోవడం, 9-11 నెలలకు నిలబడడం, 11-13 నెలలకు నడవడం లాంటివి చేస్తున్నారా లేదా అనేది సర్వే బృందాలు పరీక్షిస్తారు. ఇలా 25 ప్రశ్నలకు తల్లిదండ్రుల నుంచి సమాధానాలు రాబట్టి పిల్లలకు ఎలాంటి లోపం ఉందో గుర్తిస్తారు. గుర్తించిన లోపాలకు సకాలంలో వైద్య చికిత్స అందించి ఆరోగ్యవంతులుగా చేసేందుకు కృషి చేస్తారు.

### అంగన్‌వాడీలు, ఆశలకు శిక్షణ

మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికెళ్లి 0–6 ఏండ్లలోపు పిల్లలను పరీక్షించేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలకు మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు వైద్యారోగ్యశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను ఎలా గుర్తించాలో.. 25 రకాల ప్రశ్నలకు ఎలా జవాబులు రాబట్టాలో కూడా శిక్షణలో వివరించారు. వచ్చే నెల నుంచే ఈ సర్వే ప్రారంభం కానున్నది.

### మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు



ఎదుగుదలలో లోపాలున్న చిన్నారులను గుర్తించేందుకు బొంరాస్‌పేట మండలాన్ని కలెక్టర్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 0–6 ఏండ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తిస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఇంటింటికెళ్లి తల్లిదండ్రులను కలిసి పిల్లల్లో ఉన్న లోపాలపై 25 ప్రశ్నలతో రూపొందించిన ఫార్మాట్‌లో జవాబులు రాబడ్తారు. లోపాలను గుర్తించిన పిల్లలను దవాఖానలకు రెఫర్ చేసి మంచి వైద్యం అందిస్తే భవిష్యత్తులో వారు ఆరోగ్యంగా ఉంటారు. ఇది మంచి కార్యక్రమం.

-డాక్టర్ హేమంత్, మండల వైద్యాధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలి
- మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 24 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని.. వాటి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. వన మహోత్సవం, మహిళా శక్తి క్యాంటీన్లు, సీజనల్ వ్యాధులపై కలెక్టర్ శశాంక బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, స్పెషల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మండల అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి గ్రామాల్లో రోజువారీగా నిర్వహించే పనులను విధిగా చేయించాలని.. తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యంపై ప్రతిరోజూ నివేదికలు పంపించాలని డీపీవోకు ఆయన సూచించారు. అధికారులు గ్రామాల వారీగా సందర్శించాలన్నారు. వైద్యారోగ్యశాఖతోపాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని.. ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, అన్ని ఇండ్లు, సంస్థల్లో కార్యక్రమాన్ని చేపట్టి, నిల్వ ఉన్న నీటిని బయట పారబోసి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాట్లు చేయాలని, మైక్రోఎంటర్‌ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు, స్టిచింగ్, మహిళా శక్తి క్యాంటీన్, జిల్లా, మండలం, గ్రామాల వారీగా మహిళా సమైక్య సంఘాల గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు పారదర్శకంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, పరిశ్రమల శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారిణి పద్మజారమణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వరీ దేవి, అటవీ జిల్లా అధికారి సుధాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఏరియా దవాఖాన ఆకస్మిక తనిఖీ

వనస్థలిపురంలోని ఏరియా దవాఖానను కలెక్టర్ శశాంక ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని వైద్య సిబ్బంది, రోగులకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. పార్కింగ్ సమస్య దృష్టికి రావడంతో వెంటనే పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి వసతులు కల్పించాలని ఏరియా దవాఖాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దవాఖానలోని సీవరేజ్, డ్రింకింగ్ వాటర్ సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, సీవరేజ్ బోర్డు అధికారులకు చెప్పామన్నారు. అదేవిధంగా లిఫ్టు మరమ్మతులు, మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణం, సిటీస్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టీఎస్‌ఎంఐడీసీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. మహేశ్వరం మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు, ప్రొఫెసర్లు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరిస్తామన్నారు. మహేశ్వరం మెడికల్ కాలేజ్ నిర్వహణ కోసం చేపడుతున్న పనులను ఈ సందర్భంగా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో, టీఎస్‌ఎంఐడీసీ అధికారులు, మండల అధికారుల బృందంతో పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజుయాదవ్, హయత్ నగర్ తహసీల్దార్, డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.